ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శనివారం 29 జూన్ 2024

కాంగ్రెస్‌లో కోల్డ్‌వార్!



- మంత్రులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కరువు?
- కొండా వర్సెస్ సీతక్కగా జిల్లా రాజకీయాలు
- మేడారం జాతర నుంచే మొదలైన విభేదాలు
- సీఎం పర్యటన ఏర్పాట్లలోనూ ఎవరికి వారే..
- ఎమ్మెల్యే రేవూరి, సురేఖ మధ్య పరకాల చేరికల రగడ
- ఫోన్ సంభాషణతో ఇద్దరి అధిపత్య పోరు వెలుగులోకి..
- ఓరుగల్లు రాజకీయాలపై అధిష్ఠానం అసంతృప్తి
- రేవంత్‌రెడ్డి పర్యటనతోనైనా నేతల చేతులు కలిసేనా?

7

గోస తీరేనా..? దశ మారేనా?



నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి



రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా.. రెండో రాజధానిగా.. వరంగల్, హనుమకొండ, కాజీపేట మూడు ప్రధాన పట్టణాలు కలగలిసిన ట్రైసిటీగా ఎంతో పేరున్న ఓరుగల్లును సుదీర్ఘకాలంగా ఎన్నో సమస్యలు, అసంపూర్తి పనులు వేధిస్తున్నాయి. నగరం విస్తరిస్తున్నంత వేగంగా అభివృద్ధి జరగకపోతుండటం పట్ల ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా నగరవాసుల గోస తీరడం లేదని, దశ మారడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించ నుండటంతో పాటు ఉమ్మడిజిల్లా అభివృద్ధి స్వరూపా న్ని మార్చే దేశంలోనే అతి పెద్ద వస్త్రపరిశ్రమ కాకతీ య మెగా టెక్స్‌టైల్ పార్కు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించడంతో పాటు నగరవాసులను 30ఏళ్లుగా ఊరిస్తున్న భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటు, రింగ్‌రోడ్డు, మామునూరు ఎయిర్‌పోర్టు లాంటి ప్రధాన అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించ నున్నారు. దీంతో ఇక నగరం, ఉమ్మడి జిల్లా దశ మారుతుందని ప్రజలు ఆకాంక్షిస్తు న్నారు. ఈ పర్యటనలో సీఎం వనమహోత్సవానికి వరంగల్ నుంచే శ్రీకారం చుట్టనున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లును దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలెన్నో

- నేడు సీఎం హోదాలో తొలిసారి వరంగల్ రానున్న రేవంత్‌రెడ్డి
- అభివృద్ధి పనులు, ఎన్నికల హామీలపై అధికారులతో సమీక్ష
- మెగా టెక్స్‌టైల్ పార్కు, సూపర్ స్పెషాలిటీ అస్పత్రి పనుల పరిశీలన
- వరంగల్‌లో వస్త్రపరిశ్రమ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించే చాన్స్
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు నిధులు కేటాయించే అవకాశం
- కాళోజీ కళాక్షేత్రం, మామునూరు ఎయిర్‌పోర్టుపైనా రివ్యూ



మామునూరు ఎయిర్‌పోర్టు

వివరాలు : 7 లో..



కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు

పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

మహదేవపూర్, జూన్ 28: పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. మండలంలోని కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ కాళేశ్వరం స్టేషన్ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న దృష్ట్యా సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్యూటీల్లో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అలాగే పూస్కుపల్లిలోని మూడు ఇసుక క్వారీలను ఎస్పీ పరిశీలించారు. పరిమితికి లోబడి మాత్రమే లోడింగ్ చేయాలని నిర్వాహకులకు సూ చించారు. లారీ డ్రైవర్ల వద్ద డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లారీ డ్రైవర్లతో మాట్లాడుతూ రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.

కాళేశ్వరం గ్రామంలో వాహనాలను తనిఖీ చేసి నంబర్‌ప్లేట్లు లేని వాటికి జరిమానాలు విధించారు. ఆయన వెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, కాళేశ్వరం ఇన్‌చార్జి ఎస్సై చక్రపాణి ఉన్నారు.

గోదావరి కరకట్ట నిర్మాణాలు వేగవంతం

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



రామన్నగూడెం వద్ద గోదావరి కరకట్టను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం రూరల్, జూన్ 28: గోదావరిపై చేపడుతున్న కరకట్ట నిర్మాణాలను వేగవంతం చేస్తామని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలో మంత్రి గురువారం విస్తృతంగా పర్యటించారు. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. కరకట్ట దెబ్బతిన్న ప్రదేశాల్లో తాత్కాలికంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. గోదావరి వరదల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నామన్నారు. కరకట్ట నిర్మాణానికి కొత్త డిజైన్ సిద్ధం చేసినట్లు తెలిపారు.

మూడేళ్లగా కరకట్ట నిర్మాణ పనుల పనులకు కొత్త టెక్నాలజీ అందుబాటులోకి తెస్తున్నామన్నారు. పలు రాష్ట్రాల్లో నిర్మించిన కరకట్టను పరిశీలించిన అనంతరం కొన్ని నమూనాలను తీసుకున్నామని మంత్రి తెలిపారు. డిజైన్లను సిద్ధం చేయడంలో కొంత ఆలస్యమైందని, ప్రస్తుతానికి కరకట్ట దిబ్బతిన్న చోట్ల ఇబ్బందులు కలగకుండా మరమ్మతు పనులను వేగవంతం చేశామని అన్నారు. వర్షాల వల్ల పనులకు అంతరాయం కలిగే అవకాశముందని, వచ్చే ఏడాది మార్చిలోగా కరకట్ట నిర్మాణాలను పూర్తి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో గోదావరి వరదల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందుకెళ్తామని, గోదావరి వరదలు, కరకట్ట నిర్మాణాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నామని అన్నారు. ఏజెన్సీలో వనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని ఉపయోగించుకొని ప్రాంత అభివృద్ధికి బాటలు వేస్తామని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు, వరదల పట్ల అధికార యంత్రాంగం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని మంత్రి తెలిపారు. ఆమె వెంట కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అడిషనల్ కలెక్టర్ శ్రీజ తదితరులు ఉన్నారు.

అధికారులతో సమావేశం

మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ధనసరి సీతక్క సమావేశమయ్యారు. కరకట్ట నిర్మాణాలపై సమీక్షించారు. కరకట్ట నిర్మాణాలకు సంబంధించిన నమూనా, కొత్త డిజైన్‌పై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఆయా రాష్ట్రాల్లో నిర్మించిన కరకట్టలు, వాటి నాణ్యతలపై చర్చించారు. వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు ప్రత్యేక తీసుకోవాలని సూచించారు. గోదావరి కరకట్టపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. కొత్తగా చేపట్టే పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా కృషి చేయాలని అన్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు

లారీ డ్రైవర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న యువకులు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్సై

వాజేడు, జూన్ 28: దారి దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వెంకటాపురం (నూగరు) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఈ విషయాన్ని వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం. ఈనెల 25న రాత్రి 10 గంటల సమయంలో వాజేడు మండలంలోని ప్రగళ్లపల్లి గ్రామ శివారులో వెంకటాపురం వైపు నుంచి వస్తున్న ఇసుక లారీలను ఆపిన ముగ్గురు యువకులు డ్రైవర్లకు కత్తులు చూపి డబ్బులు వసూలు చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కారును అడ్డంగా పెట్టి ఓ లారీని ఆపారు. హైదరబాద్‌లోని జీడిమెట్లకు చెందిన గోవిందరాజు అనే డ్రైవర్‌పై కత్తులతో దాడి చేసి రూ. 3వేలు దోచుకొని అక్కడి నుంచి ఉడాయించారు. ఈ విషయాన్ని ఆ డ్రైవర్ వీడియో ద్వారా సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. అది కాస్త వైరల్ అయ్యింది. ఈ క్రమంలోనే వాజేడు పోలీస్‌స్టేషన్‌లో అతడు గురువారం ఫిర్యాదు చేశాడు. కేసును నమోదు చేసిన ఎస్సై హరీశ్ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం జగన్నాథపురం వైజంక్షన్ వద్ద సీఐ కుమార్ నేతృత్వంలో వాహనాల తనిఖీ చేస్తుండగా చత్తీస్‌గఢ్ వైపు నుంచి వస్తున్న కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకొని విచారించారు. లారీ డ్రైవర్‌ను తామే బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో వారు అంగీకరించారు. నిందితులు వెంకటాపురం (నూగూరు) మండలంలోనీ వీరభద్రవరం గ్రామానికి చెందిన బట్ట నీరజ్‌కుమార్, పూనెం దీలిప్, పాలెంకు చెందిన కవ్వాల వెంకట శ్రీనివాస్‌ను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి ఒక కత్తితోపాటు షిఫ్ట్ డిజైర్ కారు, రూ. 1,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

బొగ్గుగనుల వేలాన్ని నిలిపివేయాలి

సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి

గోవిందరావుపేట, జూన్ 28: బొగ్గుగనుల వేలాన్ని నిలిపివేసి సింగరేణిని పరిరక్షించాలని సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పస్రాలో శుక్రవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే బొగ్గుగనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా బొగ్గుగనులను వేలం వేయడం దుర్మార్గ చర్య అని విమర్శించారు. ఒకపక్క బొగ్గుగనులను ప్రైవేటీకరించబోమని పేర్కొంటూ వేలంపాట నిర్వహించడం సరికాదని అన్నారు. సింగరేణిపై ప్రత్యక్షంగా 40వేల మంది, పరోక్షంగా మరో 40 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నానరు. అలాంటి సంస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈసమావేశంలో మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి, నాయకులు సోమ మల్లారెడ్డి, కడారి నాగరాజు, అంబాల మురళి, యానాల ధర్మారెడ్డి, పల్లపు రాజు, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన రుణాలను మంజూరు చేయాలి

బ్యాంకర్లతో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 28: నిర్దేశించిన రుణాలను మంజూరు చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 వార్షిక సంవత్సరానికి రూ. 2,223.41 కోట్ల రుణ మంజూరును ఆమోదించినట్లు తెలిపారు. 12 రంగాలకు రూ. 1,991.55 కోట్ల రుణాల లక్ష్యంగా కాగా రూ. 1,453.32 కోట్లను మంజూరు చేసినట్లు వివరించారు. పీఎంఈజీపీ 75 యూనిట్లకు రూ. 243.74 కోట్ల లక్ష్యం కాగా 26 యూనిట్లను మంజూరుచేసి రూ.96.31 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. 35,354 మందికి ముద్ర రుణాల కోసం రూ. 209 కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, చేపల పెంపకం, పామాయిల్‌సాగు, స్వయం ఉపాధి, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు సమష్టి రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో గొర్రెలు, పండ్ల తోటల పెంపకానికి మంచి అవకాశాలు ఉన్నాయని, బ్యాంకర్లు వీటి కోసం రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం తిరుపతి, ఆర్బీఐ నోడల్ అధికారి అలీబాబా తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల్లో కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కేటీకే-5వ గనికి చేరుకున్న నూతన ఎస్‌డీఎల్ యంత్రం

వివరాలు 8వ పేజీలో...

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపిక పోటీలు

భూపాలపల్లిటౌన్, జూన్ 28: స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం సంబంధిత అధికారులు శుక్రవారం ఎంపిక పోటీలు నిర్వహించా రు. భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీ అంబేద్కర్ క్రీడా మై దానంలో ఈ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 60 మంది నాలుగో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జూలై 8న హైదరాబాద్ హకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు క్రీడల శాఖ జిల్లా అధికారి రఘు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యాలయ ఉద్యోగి శివ తదితరులు పాల్గొన్నారు.

ఘొల్లుమంటున్న బిల్ కలెక్టర్లు

60 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తొలగింపు

ఇప్పటికీ విధులు కేటాయించని వైనం

టౌన్‌ప్లానింగ్‌కు ఇవ్వాలని సిబ్బంది డిమాండ్

తూతూ మంత్రంగా కొందరికి విధులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 28: బల్దియాలో పదేళ్లుగా పని చేస్తున్న బిల్ కలెక్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కరీంనగర్, హైదరాబాద్‌లో కొందరు అవినీతి బిల్‌కలెక్టర్లు చేసిన పొరపాటుకు ఉన్నఫలంగా రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై వేటు వేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,500 మంది బిల్ కలెక్టర్లను హోల్డ్‌లో పెట్టగా వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో మీ సేవాకేంద్రాలు, వార్డు కార్యాలయాలలో పనిచేస్తున్న 60మందిని రెండు నెలల కిందట పక్కనపెట్టారు. వారిలో కొందరికి ఇప్పటి వరకు ఏ పని చేయాలి? అనే స్పష్టత లేకపోవడం, ఎలాంటి విధులు కేటాయించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొందరికి తూతూమంత్రంగా అక్కడక్కడా విధులు కేటాయిస్తూ అధికారులు చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నట్లు వాపోయారు. ఖాళీగా ఉన్న కొందరికి ఏం చేయాలలో తెలియక బల్దియా చుట్టూ తిరుగుతున్నారు.

2014లో నియామకం

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అనుకుని చుట్టుపక్కల ఉన్న 42 గ్రామాలను 2013లో బల్దియాలో విలీనం చేశారు. అప్పటి వరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కారోబార్లుగా, అంటెండర్లుగా, పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారితో పాటు నగరంలో అర్హత గల నిరుద్యోగులను బల్దియాలో బిల్లులు వసూలు చేసేందుకు దినసరి వేతన కూలీలుగా విధులకు ఎంపికచేశారు. కాగా, 2019లో అప్పటి కమిషనర్ గౌతమ్ ప్రత్యేక శ్రద్ధతో 60 మందిని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి జీవోను జారీ చేశారు. నెలకు రూ.15,600 జీతం ఇస్తుండగా ఈఎస్ఐ, పీఎఫ్ పోను రూ.13,000 చేతికి అందుతున్నాయి. అప్పటి నుంచి వారు వరంగల్ బల్దియా మీ సేవా కేంద్రాలతో పాటు డివిజన్‌లలోని వార్డు కార్యాలయాల్లో, మరికొందరు ప్రభుత్వ ఉద్యోగులను కలుపుకుని 80 మంది పని చేస్తున్నారు. వారు ఇంటి పన్ను, నల్లా పన్ను, చెత్తపన్నులతో పాటు ఇతర పనులు చేస్తున్నారు. 80 మందిలో 60 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కాగా, 20 మంది ప్రభుత్వ ఉద్యోగులు రెండు మాసాల కిందటి వరకు పని చేశారు. అయితే మార్చిలో హైదరాబాద్, కరీంనగర్ మునిసిపల్ కార్యాలయాల పరిధిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లు పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బులను సొంతానికి వాడుకుని విధులకు డుమ్మాకొట్టారు. విషయం హైదరాబాద్ సీడీఎంఏ అధికారుల దృష్టికి వెళ్లడంతో రాష్ట్రం మొత్తంగా మున్సిపాలిటీలలో పని చేస్తున్న సిబ్బందిపై వేటు వేశారు. ఈ యేడు ఏప్రిల్ 30వరకు పని చేయించుకుని విధులు నిర్వర్తించకూడదని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. తర్వాత మే 5న విధుల నుంచి హోల్డ్‌లో పెట్టారు. అయితే వీరు పనిచేసిన స్థానాల్లో ఇటీవల రెవెన్యూ విభాగం నుంచి మున్సిపాలిటీకి కేటాయించిన వీఆర్ఏలు, వీఆర్వోలను వార్డు ఆఫీసర్లుగా నియమించి బిల్లుల వసూళ్లకు కేటాయించారు.

టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలకు కేటాయించాలి

ఎక్కడో జరిగిన పొరపాటుకు తమను బాధ్యులను చేయడం సరైంది కాదని బిల్‌కలెక్టర్లు అంటున్నారు. విధుల నుంచి తొలగించిన తమను టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలతో పాటు ప్రస్తుతం వార్డు ఆఫీసర్లకు సహాయకులుగా నియమించాలని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. తాము తొలగించిన రెండు మాసాలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయగా కొందరికి శానిటేషన్‌లో, మరి కొందరికి ఆర్‌డబ్ల్యుఎస్‌లో ఇంకుడు గుంతల సర్వేకు కేటాయించారని తెలిపారు. ఈ పని చేయడం ఉన్నత చదువులు చదువుకున్న తమకు ఇబ్బందిగా ఉందన్నారు. బల్దియా కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో సూపర్‌వైజర్ లేదా టౌన్ ప్లానింగ్ విభాగంలో చైన్‌మెన్లుగా నియమించాలని కమిషనర్‌ను విజ్ఞప్తి చేస్తున్నారు.



జర.. నన్ను పట్టించుకోండి..

ఎంజీఎంలో అలంకారప్రాయంగా ఫిర్యాదుల పెట్టె

వరంగల్ మెడికల్, జూన్ 28: నిరుపేదల రోగుల సంజీవని ఎంజీఎం ఆస్పత్రిలో ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని నలుమూలల నుంచి పేద రోగులు పెద్దాస్పత్రికి వస్తుంటారు. 1,700 పడకలు కలిగిన ఎంజీఎం ఆస్పత్రిలో రోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా సలహాలు కూడా ఇవ్వడానికి పలువురు ముందుకు వస్తున్నారు. ఎక్కడైనా, ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయవచ్చని అధికారులు ఈ ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. అయితే అధికారులను నమ్మి ఫిర్యాదు చేస్తే మాత్రం పట్టించుకోరు. రోజూ అధికారులు తిరిగే స్థలంలోనే ఈ బాక్స్ ఉన్నప్పటికీ అటువైపు కన్నెత్తి కూడా చూడరు. రోగులంటే ఇంత నిర్లక్ష్యమా? అని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం సేవల మాట దేవుడెరుగు కానీ.. కనీసం సమస్యలను కూడా పట్టించుకోకపోవడంపై రోగులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫిర్యాదులు, సలహాలపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎంజీఎంలో ఫిర్యాదులతో నిండి ఉన్న పెట్టె

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

కేయూ క్యాంపస్, జూన్ 28: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ శుక్రవారం తెలిపారు. డీబారైన వారిలో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కరు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం జరిగిన పరీక్షలలో 2,673 మందికిగాను 1,952 మంది పరీక్షలకు హాజరు కాగా, 721 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పీజీ పరీక్షల రీ షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్, జూన్ 28: కాకతీయ యూనివర్సిటీ పీజీ కోర్సులు (నాన్ ప్రొఫెషనల్) నాలుగో సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్‌ను శుక్రవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి విడుదల చేశారు. జూలై 5, 8, 10, 12,15, 18వ తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ విద్యార్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

దూరవిద్య పీజీ సైన్స్ ఫీజు గడువు 15

కేయూ క్యాంపస్, జూన్ 28: కేయూ దూరవిద్య కేంద్రం 2024-25 ఏడాదికి సంబంధించిన పీజీ సైన్స్ ద్వితీయ ఏడాది కోర్సుల ఫీజులను జూలై15 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే క్లాస్‌లను నిర్వహిస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు 0870-2461480, 2461490 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పేర్కొన్నారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల వెల్లడి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 28: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. వరంగల్ జిల్లాలో మొత్తం 778 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 600 మంది 77.12 శాతం ఉత్తీర్ణత సాధించారు. హనుమకొండ జిల్లాలో 593 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 557 మంది 94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

1న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ జూన్ 28: వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 1న హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌యాదవ్, యుగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8, 10, 12 బాలబాలికల విభాగంలో వరంగల్ జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్-8 విభాగంలో పాల్గొనే బాలబాలికలు 8 జూలై 2016 నుంచి 7 జూలై 2018 మధ్యలో జన్మించిన వారై ఉండాలని, అండర్-10 విభాగంలో 8 జూలై 2014 నుంచి 7 జూలై 2016 మధ్యలో జన్మించాలని, అండర్-12 విభాగంలో 8 జూలై 2012 నుంచి 2014 మధ్యలో జన్మించినవారు జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ జూలై 7 నుంచి హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాలబాలికలు జూలై 1న ఉదయం 8 గంటలకు హనుమకొండ జేఎన్ క్రీడామైదానంలో రిపోర్టు చేయాలని వారు సూచించారు. ఇతర వివరాలకు సెల్ 9866564422 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డిస్కమ్ సమాచారం కోసం అప్లికేషన్ డెవలప్

హనుమకొండ టౌన్, జూన్ 28: డిస్కమ్ పూర్తి సమాచారం తెలుసుకునేందుకు వీక్షించే డాష్ బోర్డు అప్లికేషన్‌ను డెవలప్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. అప్లికేషన్ డెవలప్‌పై పవర్‌గ్రిడ్ కంపెనీ సీఎండీతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ అప్లికేషన్ డెవలప్ గురించి మాట్లాడుతూ.. దీని ద్వారా వర్క్ ఫోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టం, డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్, వినియోగదారుల పోర్టల్, సిటిజన్ మేనేజ్‌మెంట్, మీటర్ డాటా మేనేజ్‌మెంట్, అస్సెట్ మేనేజ్‌మెంట్, సమగ్ర వివరాలను తెలుసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. బిల్లింగ్, కలెక్షన్ అంతరాయాలు, ఫిర్యాదుల వివరాలు, కమాండ్ కంట్రోల్ లాగా ప్రతీ ఒక్క సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. చాట్‌బాట్, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని, తద్వారా వారి సమస్యలను త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. ఎన్పీడీసీఎల్ వినియోగదారులకు మరింత చేరువై వారిసమస్యలు తీర్చే కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.మోహన్‌రావు, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, మధుసూదన్, కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్. గుప్త, జీఎంలు పాల్గొన్నారు.

నేడు ట్రాన్స్‌కో సీఎండీ రాక

హనుమకొండ టౌన్, జూన్28: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా టీజీ ట్రాన్స్‌కో సీఎండీ వరంగల్‌కు వస్తున్నారు. ఈ సందర్భంగా నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్‌ను సందర్శించనున్నట్లు సమాచారం. ఉదయం 9గంటలలోపే నక్కలగుట్టలోని ఎలక్ట్రిసిటీ గెస్ట్‌హౌస్‌కు చేరుకొని ముఖ్యులతో సమావేశమై, నగరంలోని ఒకటి, రెండు సబ్‌స్టేషన్‌లను సైతం పరిశీలించే అవకాశాలున్నట్లు ఎన్పీడీసీఎల్ అధికారులు పేర్కొన్నారు.

సీకేఎం కాలేజీలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పోచమ్మమైదాన్, జూన్ 28: వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి విద్యాశాఖ కమిషనర్ అనుమతి ఇచ్చినట్లు సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎకనామిక్స్-1, హిస్టరీ-1, పొలిటికల్ సైన్స్-1, తెలుగు-1, కెమిస్ట్రీ-1, మేథమెటిక్స్-1, ఫిజిక్స్-1, కంప్యూటర్ సైన్స్-1, బాటనీ-1 విభాగాలలో (ఒక్కొక్క పోస్టు చొప్పున), కామర్స్‌లో రెండు పోస్టులు ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. యూజీసీ నిబంధనల ప్రకారం పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ 50శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ ఉన్నవారు అర్హులని తెలిపారు. ఆసక్తి కల్గిన వారు జూలై 1వ తేది సాయంత్రం 5గంటల వరకు దరకాస్తులు చేసుకోవాలని, జూలై 2వ తేదిన ఉదయం 10గంటలకు సీకేఎం కళాశాలలో ఇంటర్వూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



సీఎం రాక సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

గోస తీరేనా? దశ మారేనా?

ఓరుగల్లును దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలెన్నో..

నేడు సీఎం హోదాలో తొలిసారి వరంగల్‌కు రానున్న రేవంత్‌రెడ్డి

అభివృద్ధి పనులు, ఎన్నికల హామీలపై అధికారులతో సమీక్ష



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఓరుగల్లులో ఎన్నో సమస్యలు, అభివృద్ధి పనులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. 30 ఏళ్లుగా ఊరిస్తున్న భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటుతో పాటు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, రింగ్‌రోడ్డు పనుల పూర్తి కోసం ప్రజలంతా ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఇక దేశంలోనే అతి పెద్ద వస్త్రపరిశ్రమ కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కుకు పట్టిన గ్రహణం ఎప్పుడు వీడుతుందా అని.. మామునూరు ఎయిర్‌పోర్టును మళ్లీ వినియోగంలోకి ఎప్పుడు తీసుకొస్తారా అన్న ఆశల్లో ఉన్నారు. ఈ క్రమంలో శనివారం ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారి వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించనున్నారు. పలు పనులను పరిశీలించటంతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించనున్నారు. దీనికి తోడు మొక్కలను నాటి వనమహోత్సవానికి వరంగల్ నుంచే శ్రీకారం చుట్టనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో ఎన్నో సమస్యల నుంచి తమకు మోక్షం లభిస్తుందని, ఓరుగల్లు గోస తీరి దశమారుతుందని ఉమ్మడి జిల్లా వాసులు ఆశిస్తున్నారు.

మెగా టెక్స్‌టైల్ పార్కుపై ఆశలు

ఫామ్ టు ఫ్యాషన్.. ఫైబర్ టు ఫ్యాబ్రిక్ నినాదంతో వరంగల్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి తన వరంగల్ పర్యటనను ఈ పార్కు పరిశీలనతోనే ప్రారంభిస్తున్నారు. 2017లో అప్పటి ప్రభుత్వం రూ.1,150కోట్ల వ్యయంతో 1,350ఎకరాల్లో సుమా రు 200లకు పైగా వస్త్రకంపెనీలు ఏర్పాటు చేసి లక్ష మందికి ప్రత్యక్షంగా, మరో నాలుగు లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించబోతున్నట్లు ప్రకటించింది. 22 కంపెనీలతో ఒప్పందం చేసుకున్నా ఏడేళ్లలో కేవలం మూడు కంపెనీలు మాత్ర మే అడుగుపెట్టాయి. నిధుల కొరతతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేకపోవటం, రవాణా సౌక ర్యం, ముడిసరుకు లభ్యత లేకపోవటంతో పరిశ్రమల స్థాపనకు కంపెనీలు ఆసక్తి చూపడటం లేదు. 2023లో కేంద్ర ప్రభుత్వం పీఎం మిత్ర పథకం కింద రాష్ట్రానికి మెగా టెక్స్‌టైల్ పార్కును ప్రకటించినప్పటికీ, ఆ పథకంలో కేఎంటీపీని గుర్తిం చేందుకు ససేమిరా అంటోంది. పీఎం మిత్రలో చేరేలా కేంద్రంపై ఒత్తిడి తేవటంతో పాటు రవాణా సౌకర్యం కల్పించేందుకు రైల్వేశాఖతో చర్చలు జరపటం, వరంగల్ ఎయిర్‌పోర్టును సాధ్యమైనంత వరకు అందుబాటులోకి తీసుకవస్తేనే టెక్స్‌టైల్ పార్కులో భారీగా పెట్టుబడులు వస్తాయనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కేఎంటీపీపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో అందరిలో నూ మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ప్రధాన సమ స్యలు, అభివృద్ధి పనులతో పాటు సీఎం సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ పట్టణ మౌలిక వసతుల కల్పన సంస్థ (టీయూఎఫ్ఐడీసీ) ద్వారా గ్రేటర్ వరంగల్‌కు కేటాయించిన రూ.250కోట్ల నిధులతో నగరంలో చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహిం చనున్నారు. అలాగే మహిళ స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళ శక్తి పథకం కింద రూ.20కోట్ల చెక్కులను అందించనున్నారు. వనమ హోత్సవ కార్యక్రమానికి వరంగల్‌లోనే శ్రీకారం చుట్టనున్నారు.

భూగర్భ డ్రెయినేజీకి మోక్షం..?

వరంగల్ మహానగరాన్ని ఏటా వరద భయం వెంటాడుతోంది. నగరం అభివృద్ధి చెందినంత వేగంగా ప్రజలకు సౌకర్యాలు అందుబాటులోకి రాలేదు. ప్రధానంగా మురుగు కాలువలను కబ్జా చేసి భారీగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీంతో వరద నీరు నాలాల ద్వారా వెళ్లే పరిస్థితి లేక కాలనీల్లోకి చేరుతోంది. దీనికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణమే శరణ్యమని 30ఏళ్లుగా ఆయా ప్రభుత్వాలకు ప్రతిపాదనలు వెళ్లినా పట్టించుకున్న వారు లేక మరుగున పడుతున్నాయి. 1995లో అప్పటి అధికారులు వరంగల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీపై పలుమార్లు సర్వేలు నిర్వహించారు. పెరుగుతున్న జనాభా, కాలనీలకు అనుగుణంగా సుమారు రూ.125కోట్ల అంచనాలతో భూగర్భ డ్రెయినేజీపై ప్రతిపాదనలు తయారు చేశారు. అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఆ తరువాత 2016లో అప్పటి కలెక్టర్ ఆమ్రపాలి నేతృత్వంలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థపై ఈజీఐఎస్ సంస్థతో కలిసి కార్పొరేషన్ అధికారుల బృందం సర్వే నిర్వహించింది. మురుగునీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు డీపీఆర్‌ను సిద్ధం చేశారు. నగరంలో విలీనమైన 42గ్రామాలతో పాటు నగరం మొత్తం భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు రూ. 2,500కోట్లతో ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. అయితే గత ప్రభుత్వం భూగర్భ డ్రైనేజీపై దృష్టిసారించకపోవ టంతో అది మరుగునపడింది. ఇదే విషయమై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా విన్నవించారు. గత పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 24, మే 7వ తేదీన జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సీఎం తన హామీ మేరకు శుక్రవారం సమీక్షలో నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. దీంతో నగరవాసులకు వరద గండం కొంతనైనా తగ్గుతుందనే ఆశతో ఉన్నారు.

సాకారం దిశగా గగనయానం

నిజాంకాలంలోనే మామునూరు నుంచి అందు బాటులో ఉన్న గగన ప్రయాణం కాలక్రమేణా అందుబాటులో లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం మామునూరు విమానాశ్రయాన్ని బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేసేందుకు 2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కే ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద ఎంపిక చేసింది. ఓఎల్ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండి యా (ఏఏఐ)పూర్తి చేసి గత 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతో మామునూరు ఎయిర్‌పోర్టుకు అన్ని రకాల అనుమతులు లభించాయి. అయితే హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం మేరకు 150కి.మీ నిడివిలో ఇంకో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మామునూరు 150కిలోమీటర్లలోపే ఉంది. దీంతో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో జీఎంఆర్ సంస్థతో సంప్రదింపులు జరపటంతో పాటు వరంగల్ ఎయిర్‌పోర్టును కూడా జీఎంఆర్ సంస్థ నిర్వ హిస్తే అప్పగించేందుకు కూడా ప్రభుత్వం సుము ఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో ఎయిర్ పోర్టు కావాల్సిన భూ సేకరణ ఒక్కటే మిగిలి ఉంది. ప్రస్తుతం 696ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు 1,200ఎకరాల భూమి అవసరం. ఇంకా 504 ఎకరాల భూమిని సేకరించి ఇవ్వాల్సి ఉంది. రైతులు కూడా భూములు ఇచ్చేందుకు సుముఖంగా ఉండటంతో, వెంటనే భూసేకరణ చేయాలని సీఎం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం జరిగే సమీక్షలో ప్రధాన అంశంగా ఎయిర్‌పోర్టు అంశం ఉం డనుందని, దీంతో త్వరలోనే మామునూరు ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తుందనే చర్చ జరు గుతోంది.

సూపర్ స్పెషాలిటీ సేవలపై ఫోకస్

వరంగల్ నడిబొడ్డున సెంట్రల్ జైలును కూల్చేసి.. గత ప్రభుత్వం సుమారు 56 ఎకరాల్లో.. 24 అంతస్తుల్లో.. రూ.1,100కోట్ల వ్యయంతో 2021 జూన్ 21వ తేదీన చేపట్టిన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులు ముందుకు సాగటం లేదు. తొలుత 2023 అక్టోబరు 24వ తేదీ దసరానాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మే 17న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చొంగ్తు ఈ ఆస్పత్రి పనులను పరిశీలించి వచ్చే డిసెంబరునాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థను ఆదేశించారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఈ ఆస్పత్రి పనులను పరి శీలించనున్నారు. ఇప్పటికే 24అంతస్తుల్లో ఆస్పత్రి నిర్మించటంపై అసంతృప్తిగా ఉన్న ఆయన 12 అంతస్తుల్లోనే ఆస్పత్రి ఉండాలని గతంలోనే సూ చించారు. మిగతా 12 అంతస్తులను వేటి కోసం వినియోగించాలో సీఎం తన పర్యటనలో స్పష్టతనిస్తారని ఎదురుచూస్తున్నారు. అంతేకా కుండా వరంగల్ ఎంజీఎంలోని సమస్యలపై చర్చించి.. పాలక మండలి కూడా పని చేయకుండా ఉన్న ఎంజీఎంను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం కార్యచరణ రూపొందించే అవకాశం ఉంది.

ఇక కాళోజీ కళాక్షేత్రం జిగేల్

ధిక్కారస్వరం, ప్రజాకవిగా కాళోజీ నారాయణరావు స్మారకార్థం గత ప్రభుత్వం 2014 సెప్టెంబ రు 9వ తేదీన హనుమకొండలోని హయగ్రీవచారి మైదానంలో కాళోజీ కళాక్షేత్రానికి శంకుస్థాపన చేసింది. ప్రముఖ ఆర్కిటెక్ట్ హఫీజ్‌తో కళాక్షేత్రం ప్లాన్ తయారు చేయించి.. రూ.70 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ కళాక్షేత్రం పనులకు బిల్లులు సక్రమంగా రాకపోవటంతో నిర్మాణ సంస్థ పనుల నుంచి వైదొలిగింది. దీంతో నాటి ప్రభుత్వం మరొకరికి పనులు అప్పగించింది. పదేళ్లుగా దాదాపు 60శాతం వరకు పనులు పూర్తి చేయగా.. మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీనిపై సీఎం స్పందించి అవసరమైన నిధులు కేటాయించి, కాళోజీ జయంతి సెప్టెంబరు 9వ తేదీలోపు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నారని తెలియడంతో కళాకారులు, సాహితీకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి పరుగులు

1971లో రూపొందించిన మాస్టర్ ప్లానే ఇప్పటికి వరంగల్‌కు దిక్కయింది. 20ఏళ్లను దృష్టి పెట్టుకుని 1972లో ప్లాన్‌కు సవరణ చేశారు. 1992లోనే కొత్త మాస్టర్ ప్లాన్ తయారు చేయాల్సిఉన్నా 53ఏళ్లుగా మాస్టర్‌ప్లాన్ తయారు చేయలేదు. 2013లో మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. అయితే 2014లో తెలంగాణ ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్పులు, చేర్పులు చేసింది. మూడు జిల్లాల పరిధిలోని 19 మండలాలు, 181 రెవెన్యూ గ్రామాలు, 13 లక్షల జనాభా ఉన్నందున 2041 వరకు జనాభా 30 లక్షలకుపైగా పెరుగుతుందని అంచనాలతో ప్లాన్ రూపొందించారు. అయితే ఇప్పటికి ఆ మాస్టర్ ప్లాన్ అమలు కాలేదు. శుక్ర వారం జరిగే సమీక్షలో మాస్టర్ ప్లాన్‌పై ప్రధాన చర్చ జరగనుంది. బీఆర్ఎస్ హయంలో రూపొం దించిన మాస్టర్ ప్లాన్ మార్చి, మూడు నెలల్లో కొత్త ప్లాన్ అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. వీటితో పాటు వరంగల్ రింగురోడ్డు, ఇన్నర్ రోడ్డు పనులను సీఎం సమీక్షించనున్నారు.

నేటి సీఎం పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం 12:40 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి.. 1.30గంటలకు వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటలోని మెగా టెక్స్‌టైల్ పార్కుకు చేరుకుంటారు. మెగా టెక్స్‌టైల్ పార్కును పరిశీలించి సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించి, ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటలకు కాన్వాయ్‌లో వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి 2.45గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకుని మహిళ శక్తి క్యాంటీన్లను ప్రారంభిస్తారు. 3గంటలకు కలెక్టరేట్‌లో వరంగల్ మహానగర అభివృద్ధిపై మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు అధికారులు సమీక్ష నిర్వహిస్తారు. ఈ సమీక్షలో ప్రధానంగా వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు, వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యం తదితర పనులపై చర్చిస్తారు. సాయంత్రం 5.40గంటలకు మేడికవర్ ఆస్పత్రిని ప్రారంభించనున్నారు. సాయంత్రం 6.10గంటలకు ఆర్ట్స్ కాలేజీ మైదానంలోని హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగుప్రయాణమవుతారు.

పేదోడి భూమిపై ఎమ్మెల్యే సోదరుడి కన్ను

అనుచరులు, మున్సిపల్ అధికారులతో బెదిరింపులు

కోర్టు తీర్పు ఇచ్చినా వేధింపులు ఆగలేదని బాధితుల ఆవేదన

వరంగల్ కార్పొరేషన్, జూన్ 28: వరంగల్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే సోదరుడు పేదల భూమిపై కన్నేశాడు. భూమి ఇస్తావా..? లేక కబ్జా చేయాలా..? అని తన అనుచరగణంతో బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. మునిసిపల్ అధికారులను ఉసిగొలిపి వేసుకున్న షెడ్డును ధ్వంసం చేయించాడు. ఈ మేరకు బాధితులు శుక్రవారం తమకు జరిగిన అన్యాయాన్ని వెల్లగక్కారు.


హనుమకొండ ములుగురోడ్డు ప్రాంతానికి చెందిన దేవర రమేష్ కాపువాడ సమీపంలోని కాపు సంఘం ప్లాట్లలో సర్వే నెంబర్ 769లో 70 చదరపు గజాల భూమిని 2000లో కొనుగోలు చేశాడు. అదే ప్లాటు పక్కన ఓ ఎమ్మెల్యే సోదరుడికి భూమి ఉంది. రమేష్ ప్లాటును స్వాధీనం చేసుకుంటే తప్ప అతడి భూమిలోకి దారి ఉండదని గమనించాడు. అప్పటి నుంచి కవ్వింపు చర్యలకు పాల్పడుతూ గొడవలకు దిగేవాడని బాధితుడు తెలిపాడు. కొద్ది రోజులు తర్వాత నీకు ఇక్కడ భూమి లేదు.. వెళ్లిపో.. అని రమేష్‌ను బెదిరించాడు. అప్పుడు రమేష్ భయంతో కోర్టును ఆశ్రయించగా 2004లో రమేష్‌కు చెందిన భూమిగా తీర్పు వచ్చింది. అప్పుడే రమేష్ మునిసిపల్ శాఖ అనుమతితో 70 గజాల్లో షెడ్డు నిర్మాణం చేసుకున్నాడు. కానీ ఎమ్మెల్యే సోదరుడు ఆ స్థలాన్ని తనకు వదిలేయాలని చాలాసార్లు అడిగాడు. అయినా రమేష్ వినకపోవడంతో పలుమార్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందిని పంపించారు. అకారణంగా వేసుకున్న షెడ్డును మున్సిపల్ అధికారులు సగం వరకు గొలగించినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. అప్పటి సీపీ రంగనాథ్ దగ్గరికి వెళ్లినా ఎమ్మెల్యే సోదరుడు కలవనీయకుండా అడ్డుకున్నాడని ఆరోపించాడు. రెండు రోజుల కిందట కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్లాటు వద్దకు వచ్చి గొడవచేసి వెళ్లారని తెలిపారు. ఎమ్మెల్యే సోదరుడితో తనకు ప్రాణాపాయం ఉందని, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని రమేష్ కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు. మున్సిపల్ అధికారులు సైతం డబ్బులకు అమ్ముడుపోతూ తనను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించాడు.

రాజధాని బస్సు చార్జీలతో గరుడ ప్లస్ సేవలు

బాలసముద్రం, జూన్ 28: హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు రాజధాని బస్సులో ప్రయాణించే చార్జీలతో సమానంగా గరుడ ప్లస్ బస్సులో ప్రయాణం చేయడానికి జూలై 1నుంచి సేవలను అందుబాటులోకి రానున్నట్లు ఆర్టీసీ రీజియన్ మేనేజర్ డి.విజయ్‌భాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని బస్సు చార్జీ రూ.370తో గరుడ ప్లస్ బస్సులో సైతం రూ.370లతో ప్రయాణం చేయవచ్చన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

శిశు గృహకు నవజాత శిశువు అప్పగింత

సుబేదారి, జూన్ 28: ఎంజీఎం వైద్యులు 50 రోజుల పాటు నవ జాత శిశువుకు వైద్య సేవలను అందించి అనంతరం శిశుగృహకు శుక్రవారం తరలించారు. మే 4న దామెర మండలం ఊరుగొండ సమీపంలో అప్పుడే పుట్టిన శిశువును మట్టిలో పాతిపెట్టిన విషయం తెలిసిందే. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి దామెర పోలీసులు చేరుకుని స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకు రాగా వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు.. శిశువు బరువు అతితక్కువగా ఉన్నందున ప్రత్యేక వైద్య సహాయం అందించాలని నిర్ణయించారు. అనంతరం శిశువు ఆరోగ్యం కుదుటపడిన తర్వాత తదుపరి పునరావాసం నిమిత్తం శిశు గృహకు అప్పగిస్తామని చెప్పారు. శుక్రవారం నాటికి 50 రోజుల అనంతరం నవజాత శిశువు ఉండాల్సిన బరువు ఉన్నదని నిర్ధారించి జిల్లా బాలల పరిరక్షణ విభాగం శిశుగృహ బాధ్యులకు ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వలుపదాసు చంద్రశేఖర్, పీడియాట్రీషన్ హెచ్‌వోడీ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో నవ జాత శిశువును అప్పగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ అన్నమనేని అనిల్‌చందర్‌రావు, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి సౌరం అనిల్‌కుమార్, శిశుగృహ మేనేజర్ దూడం నగేష్, శిశుగృహ సోషల్ వర్కర్ నంగి చైతన్య, ఔట్‌రీచ్ వర్కర్ పి. విజయ్ కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ కె. రజిత పాల్గొన్నారు.



నవజాత శిశువును జిల్లా సంక్షేమ అధికారి మధురిమకు అప్పగిస్తున్న ఎంజీఎం సూపరింటెండెంట్ వలపదాసు చంద్రశేఖర్

కాంగ్రెస్‌లో కోల్డ్‌వార్!

మంత్రులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కరువు?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు కాంగ్రెస్‌లో సమన్వయం కరువైందా..? ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు మహిళా మంత్రుల మధ్య సఖ్యత లేదా? మేడారం మహాజాతర నుంచి మొదలైన ఆధిపత్య రగడ ప్రస్తుత సీఎం పర్యటన ఏర్పాట్లలోనూ కనిపించిందా? అంటే ఔననే సమాధానమే వినిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు మహిళలకే చోటిచ్చారు. అయితే మేడారం మహాజాతర అభివృద్ధి పనుల్లో మంత్రి కొండా సురేఖ జోక్యంపై సీతక్క అభ్యంతరాలు వ్యక్తం చేశారని, దాంతో వారి మధ్య ఆధిపత్యపోరు మొదలైందన్న చర్చ అప్పట్లో జరిగింది. దానికి బలం చేకూరుస్తూ ఆ ఇద్దరు మంత్రులు తమ నియోజకవర్గాలకు లేదంటే హైదరాబాద్‌కే పరిమితం అవుతున్నారని, ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిని పట్టించుకునే వారే కరువయ్యారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ వెలుగులోకి రావడం, అది కాస్తా రచ్చకెక్కడం చర్చనీయాంశంగా మారింది. అయితే శనివారం సీఎం రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్, హనుమకొండ పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆయన మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఉన్న సమన్వయలోపాన్ని సరిదిద్దుతారా అనే ఉత్కంఠ కాంగ్రెస్ శ్రేణుల్లో కనిపిస్తోంది.

మేడారం జాతర నుంచే షురూ..

సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గంలోకి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ, ములుగు ఎమ్మెల్యే ధనసరి అనసూయ అలియాస్ సీతక్కలకు చోటు కల్పించారు. వీరు మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే మేడారం మహాజాతర మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం తొలుత రూ.75కోట్లు, ఆ తరువాత రూ.105కోట్ల వరకు నిధులు విడుదల చేసింది. మేడారం.. ములుగు నియోజకవర్గం పరిధిలోనే ఉండటంతో అభివృద్ధి పనుల్లో ఇతరుల జోక్యాన్ని సీతక్క ప్రోత్సహించలేదని ప్రచారం జరిగింది. అయితే దేవాదాయ శాఖ, అటవీశాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు కూడా జాతర పనులు, అభివృద్ధి విషయంలో జోక్యం చేసుకునే అవకాశం సీతక్క ఇవ్వలేదనే ప్రచారం జరిగింది. దాంతో మనస్తాపం చెందిన కొండా సురేఖ జాతరకు ముందు ఒకసారి వనదేవతల గద్దెలను దర్శించుకుని సమీక్ష నిర్వహించి వెళ్లారు. ఆ తర్వాత జాతర సమయంలో సీఎంతో కలిసి వచ్చారు. సీతక్క ఒత్తిడి మూలంగానే దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ కొండా సురేఖ మేడారం జాతరలో పాల్గొనలేదన్న ఊహాగానాలు వచ్చాయి. అప్పటి నుంచే మంత్రులు కొండా సురేఖ, సీతక్క మధ్య విభేదాలకు బీజం పడిందనే చర్చ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మొదలైంది. ఆ తరువాత ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇద్దరి మధ్య ఆధిపత్యం కారణంగా కాంగ్రెస్‌కు కొంత నష్టం చేకూర్చిందని కొందరు నేతలు పేర్కొన్నట్లు సమాచారం. ఆదిలాబాద్ ఎంపీ స్థానంలో ఆదివాసీ ఓట్లు అధికంగా ఉండటంతో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి సీతక్కకు ఆదిలాబాద్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కొండా సురేఖను వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే కడియం కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత సురేఖను మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా పంపించి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి వరంగల్ బాధ్యతలు ఇచ్చారు. అప్పటికే రేవూరి, కొండా సురేఖ మధ్య విభేదాలు ఉండటంతో అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం కొండా వర్గీయులను అసంతృప్తికి గురి చేసింది. అయితే మంత్రి సీతక్క వెనక నుంచి చక్రం తిప్పి సురేఖను వరంగల్ నుంచి మెదక్ ఇన్‌చార్జ్‌గా వెళ్లేలా చేశారన్న చర్చ వరంగల్ కాంగ్రెస్ శ్రేణుల్లో జరిగింది. అయితే సురేఖ, సీతక్కలకు ఇన్‌చార్జ్‌లుగా అప్పగించిన మెదక్, ఆదిలాబాద్ ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ ఓడిపోవటంతో ఇద్దరి మంత్రులపైన అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసిందనే చర్చ జరుగుతోంది. పైగా మంత్రి కొండా సురేఖ సొంత నియోజకవర్గం వరంగల్ తూర్పులో బీజేపీకి మెజారిటీ రావటం కూడా చర్చనీయాంశంగా మారింది. అలాగే హనుమకొండ జిల్లా భద్రకాళి ఆలయ సమీపంలోని మాడ విధుల్లోని ధార్మిక భవన్‌లో మేడారం పూజారులకు గదుల కేటాయింపుపై ఏర్పడిన వివాదంలో సీతక్క పాత్ర ఉందని కొండా వర్గీయులు ఆరోపిస్తున్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాల్సి ఉండగా, వివాదం చేస్తున్నారని దేవాదాయశాఖ మంత్రిగా ఉన్న సురేఖ వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేయటం చర్చనీయాంశంగా మారింది.

సీఎం పర్యటన ఏర్పాట్లలోనూ...

సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లలోనూ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు స్పష్టంగా కనిపించాయనే చర్చ జరుగుతోంది. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, వరంగల్ నగర అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు.. కలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. అయితే ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క ఎలాంటి సందేశం, సూచనలు ఇవ్వకుండా మౌనంగా కూర్చున్నట్లు తెలిసింది. అంతేకాకుండా సమీక్ష తరువాత కొండా సురేఖ విలేకరుల సమావేశం నిర్వహించగా.. సీతక్క ఈ విలేకరుల సమావేశంలో పాల్గొనకుండా ముందుగానే వెళ్లిపోయారు.

అలాగే నగర పరిధిలో ఉన్న పర కాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, సీనియర్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా సమీక్ష తర్వాత ప్రెస్‌మీట్‌కు హాజరవకుండావెళ్లిపోవడం పలు అనుమానాలను రేకెత్తించింది. ప్రెస్‌మీట్‌లో పాల్గొనకుండా వెళ్లిపోయిన సీతక్క, ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా గతంలో టీడీపీలో కలిసి పని చేసిన నేతలే కావటం మరింత చర్చనీయాంశమైంది. ప్రెస్‌మీట్‌లో కొండా సురేఖతో పాటు మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు మాత్రమే పాల్గొన్నారు. ఇదంతా చూస్తుంటే కాంగ్రెస్‌లో కొత్త, పాత నేతలుగా గ్రూపులు ఏర్పడ్డాయనే చర్చ జరుగుతోంది.

కొండా, రేవూరి మధ్య పరకాల రగడ

పరకాల నియోజకవర్గంలో గ్రూపుల లొల్లి మరింత ముదురుతోందన్న చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నుంచి పోటీకి కొండా మురళీధర్‌రావు ఆసక్తి చూపారు. తనకు కాదంటే తన కూతురు సుష్మితకు ఇవ్వాలని పట్టుపట్టారు. కానీ అనూహ్యంగా బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో నర్సంపేట రేవూరి ప్రకాష్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. అయినా కొండా దంపతులు అసంతృప్తి చెందకుండా ప్రకాష్‌రెడ్డి గెలుపునకు పనిచేశారనే చర్చ జరిగింది. కానీ ప్రకాష్‌రెడ్డి గెలిచిన తరువాత తన వర్గాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు చేరికలకు ప్రాధాన్యం ఇవ్వటాన్ని కొండా వర్గీయులు వ్యతిరేకించారనే ప్రచారం జరిగింది. అలాగే తనకు సంబంధం లేకుండా నేరుగా కొండా మురళీ పరకాల నియోజకవర్గ నేతలను పార్టీలో చేర్చుకోవడాన్ని ఎమ్మెల్యే రేవూరి వ్యతిరేకించారని సమాచారం. ఇదే సమయంలో గీసుకొండ ఎంపీపీని కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని మంత్రి సురేఖ తీవ్రంగా వ్యతిరేకిస్తూ రేవూరితో ఫోన్‌లో మాట్లాడిన సంభాషణ లీక్ అయింది. ఇలా పరకాల నియోజకవర్గానికి సంబంధించి కొండా దంపతులకు, ఎమ్మెల్యేతో పాటు వారి వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోందన్న చర్చ జరుగుతోంది. అయితే మంత్రి సీతక్క ప్రొద్బలంతోనే రేవూరి ప్రకాష్‌రెడ్డి కయ్యానికి కాలు దువ్వుతున్నారని కొండా వర్గీయులు అనుమానాలు వ్యక్తం చేస్తుండటం గమనార్హం

రేవంత్ రాకతో సమన్వయం కుదిరేనా?

ఓరుగల్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య సయోధ్య లేదన్న చర్చ జరుగుతున్న క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనకు వస్తున్నారు. అభివృద్ధి పనుల పరిశీలనతో పాటు పెండింగ్ సమస్యల పరిష్కారం, నగర అభివృద్ధికి తీసుకో వాల్సిన చర్యలపై సమీక్షించనున్న ఆయన పీసీసీ చీఫ్ హోదాలో ఉమ్మడి జిల్లా పార్టీలో జరుగు తున్న కోల్డ్‌వార్‌పై దృష్టిపెడతారా అని కేడర్ ఎదురుచూస్తోంది. రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎమ్మె ల్యేలు, ముఖ్యనేతలతో భేటీ అయి వారి మధ్య సమన్వయం చేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. ఇదిలాఉంటే పార్లమెంట్ ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాల పట్ల అసం తృప్తిగా ఉన్నారనే చర్చ జరుగుతోంది. మం త్రులుగా బాధ్యతలు చేపట్టి ఆరు నెలలుగా దాటి నా ఇప్పటి వరకు ఇద్దరు మంత్రులు సమష్టిగా సమీక్ష సమావేశం నిర్వహించి ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై చర్చిండంలేదని, ఎలాంటి నిర్ణయాలు తీసుకోవటం లేదన్న అసంతృప్తి అటు ప్రజలు.. ఇటు పార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. ఓరుగల్లుపై ప్రత్యేక దృష్టి పెడుతున్న రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య సయోధ్య కుదిర్చి ఉమ్మడి జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కేడర్ కోరుకుంటోంది.

నేడు డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, జూన్ 28: ప్రయాణికుల సౌకర్యార్థం వరంగల్ -1 డిపో పరిధిలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెల్ నంబర్: 98663 73825లో సంప్రదించాలని కోరారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్లలో ప్రయాణించే వారు ఈ కార్యక్రమంలో పాల్గొని సూచనలు సలహాలు తెలియజేయాలని కోరారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్



ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు
- నేడు సీఎం చేతుల మీదుగా ప్రారంభం

హనుమకొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం, తద్వారా సంఘాల్లోని సభ్యుల జీవన స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలి విడత 30 క్యాంటీన్లను ఏర్పాటు చేయబోతున్నారు. హనుమకొండ జిల్లాలో అయిదింటి ఏర్పాటుకు స్థలాలను గుర్తించడం కూడా పూర్తయింది. పరకాల ఆర్టీసీ బస్‌స్టేషన్, ధర్మసాగర్ ఉనికిచెర్ల క్రాస్‌రోడ్డు దగ్గర, హసన్‌పర్తిలోని ఉద్యోగుల శిక్షణా కేంద్రం, గూడెప్పాడ్ సర్కిల్, కమలాపూర్‌లో ఉప్పల్ క్రాస్ రోడ్డు వద్ద వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పరకాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఏర్పాట్లు దాదాపు పూర్తి కావొచ్చాయి. రెండు మూడు రోజుల్లో క్యాంటీన్ ప్రారంభం కానున్నది. మిగతాచోట్ల కూడా ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణకు ముందుకు వచ్చిన మహిళా సంఘాలకు వీటిని కేటాయించారు. అర్బన్ ప్రాంతంలో కూడా ఇందిర మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో క్యాంటీన్లను మహిళా సంఘాలు నిర్వహించగా పట్టణప్రాంతాల్లోనివాటిని మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

నేడు ప్రారంభించనున్న సీఎం

హనుమకొండ కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిం చనున్నారు. క్యాంటీన్ ఏర్పాటుకు కలెక్టర్ భవనంలోనే విశాలమైన ఒక గదిని కేటాయించారు. ఇందిరా ఏరియా లెవల్ ఫెడరేషన్ సమాఖ్య దీనిని నిర్వహిస్తోంది. ఈ సమాఖ్యలో ఐదుగురు సభ్యుల బృందం- ఓ.నిఖితాంజలి, కె.పద్మ, జి.రాజేశ్వరి, జి.కవిత, టి.శిరంజని దీనిని నిర్వహి స్తారు. ఈ క్యాంటీన్ నిర్వహణకు అవసరమైన రుణ సహా యాన్ని సమాఖ్య అందించింది. ఉదయం నుంచి సాయం త్రం వరకు ఈ క్యాంటీన్ నడుస్తుంది. పాత కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మహిళల ఆధ్వర్యంలో క్యాంటీన్ నడిచేది. కొత్త భవనం నిర్మాణం సందర్భంగా దానిని తొలగించారు. కొత్త భవన నిర్మాణం జరిగిన తర్వాత తిరిగి ఏర్పాటు చేయలేదు. దీనితో వివిధ పనులపై కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చే ప్రజలు కార్యాలయం బయట ఉన్న ప్రైవేటు క్యాంటీన్లకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కలెక్టరేట్‌లోనే అందుబాటులో రావడంతో ఇబ్బంది తప్పింది.



ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

మంగపేట, జూన్ 28: ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలో ఆమె శుక్రవారం పర్యటించారు. కమలాపురం, మంగపేట, పొద్మూరు, గంపోనిగూడెం తదితర గ్రామాలను సందర్శించారు. మండల కేంద్రంలోని మంగపేట సహకార సంఘం కార్యాలయం ఎదుట నిర్మించిన రైతు సేవా కాంప్లెక్స్ భవనాన్ని కలెక్టర్ దివాకర, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాలతో కలిసి ప్రారంభించారు. పొద్మూరు శివారులోని గోదావరి కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. కమలాపురంలో మూయిలాపడ్డ బిల్ట్ ఫ్యాక్టరీని జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఫిన్‌క్వెస్ట్ సంస్థ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ నాయర్‌ను కోరారు. ఫ్యాక్టరీని ఐటీసీ సంస్థ స్వాధీనం చేసుకోవడానికి నిర్ణయించుకుందని, చిన్నపాటి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించిన తర్వాత చర్యలు చేపడతామని మంత్రికి ఆయన వివరించారు. పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణపై చర్చించారు. అనంతరం ఫ్యాక్టరీలో జరుగుతున్న డిస్మెంటల్ పనులను పరిశీలించారు. అనంతం విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. బిల్ట్ ఫ్యాక్టరీకి సంబంధించిన 619 ఎకరాల భూమి ఉందని, ఇంకా 25 ఎకరాల భూమి కొంత పెండింగ్‌లో ఉందని అన్నారు. ఆ సమస్య గురించి రెవెన్యూ అధికారులతో చర్చించామని, హద్దులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించి ఫ్యాక్టరీ పునుద్ధరణకు చర్యలు చేపట్టి ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి పూర్వ వైభవం తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతే బాబాసాహెబ్, ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ ఈపెక్స్ బ్యాంక్ చైర్మన్, టీఎస్ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మంగపేట తహసీల్దార్ బి.వీరస్వామి, ఎంపీడీవో జి.కృష్ణప్రసాద్, ఎస్సై టీవీఆర్ సూరి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, రైతుబంధు మాజీ జిల్లా నాయకుడు పచ్చ శేషగిరిరావు, ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్ రాధాకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మైల జయరామిరెడ్డి, కారుపోతుల నర్సయ్యగౌడ్, మంగపేట సహకార సంఘం సీఈవో జగన్నాథరావు, సహకార సంఘం వైస్ చైర్మన్ నరేందర్‌యాదవ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.


కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ పరిసరాల్లో మంత్రి సీతక్క

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

ఏటూరునాగారం: విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని, ఆస్పత్రులల్లో వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటు లో ఉండాలని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఏటూరునాగారం మండలంలో పర్యటించిన ఆమె ఆకులవారిఘణపురంలో ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను, వసతి గృహాన్ని కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్‌తో కలిసి సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. రామాలయం వీధిలో ఉన్న పల్లె దవాఖానను మంత్రి పరిశీలించారు. మంత్రి వెంట మండల ప్రత్యేక అధికారి, ఐటీడీఏ ఏపీవో జె.వసంతరావు, సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్‌కె. తాజుద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు ఎమ్డీ. అప్సర్ తదితరులు ఉన్నారు.


విద్యార్థినులతో కలిసి అల్పాహారం తింటున్న సీతక్క

వనదేవతలకు మంత్రి పూజలు

మేడారం : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెలను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అద నపు కలెక్టర్ శ్రీజలతో కలిసి మేడారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, అధికారులు, పూజారులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తేనే మన్ననలు

డీఈవో పదవీ విరమణ సభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి టౌన్, జూన్ 28: కష్టపడి పనిచేస్తేనే మన్ననలు పొందుతారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. డీఈవోగా పనిచేసిన రామ్‌కుమార్ ఈ విషయాన్ని రుజువు చేశారని కొనియాడారు. డీఈవో రామ్‌కుమార్ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా కలెక్టరేట్‌లో ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సన్మాన సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రతి ఉద్యోగికీ రిటైర్మెంట్ అనేది సహజమని అన్నారు. కానీ ఆ తర్వాత కూడా వారి సేవలు సమాజానికి అవసరం ఉంటా యని అన్నారు. పోలీస్ అధికారిగా నాగరాజు ఉద్యోగ విరమణ అనంతరం ప్రజా సేవ కోసం వర్ధన్నపేట ఎమ్మెల్యే కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. జిల్లాలో విద్యా వికాసం కోసం రామ్‌కుమార్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఆయన్ను మరో మూడేళ్లపాటు కొనసాగించడానికి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానని అన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అధికార హోదాలో ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్ అనంతరం పెద్ద టెన్షన్ పోతుందని అన్నారు. ఒత్తిళ్లు లేని, ప్రశాంత జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీపీవో శామ్యూల్, ఏసీజీ మండల రవీందర్‌రెడ్డి, పీఆర్‌టీయూ, టీపీటీఎఫ్, యూటీఎఫ్, టీఎస్‌పీఆర్‌టీయూ టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సేవానాయక్, నక్క తిరుపతి, తిరుపతి, రవి, అసిస్టెంట్ కార్యదర్శి భద్రయ్య, సెక్టోరియల్ అధికారి లక్ష్మణ్, సిబ్బంది శ్రీకాంత్, శ్రీధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

సమగ్రశిక్ష ఉద్యోగుల సర్వీసులు రెగ్యులరైజ్ చేయాలి : ఎస్టీయూ

ములుగు కలెక్టరేట్, జూన్ 28: పాఠశాల విద్యాశాఖలో భాగమైన సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిరుప సతీష్‌కుమార్, ఏళ్ల మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం, మండల విద్యావనరుల కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఎంఐఎస్‌లు, కోఆర్డినేటర్లు, సీఆర్పీలు పాఠశాలల సమగ్ర సమాచారాన్ని, వివిధ విద్యా సంబంధ కార్యక్రమ వివరాలు చేరవేస్తూ అనునిత్యం అందుబాటులో ఉంటూ పాఠశాల రాష్ట్ర విద్యాశాఖకు అనుసంధానంగా పనిచేస్తున్నారని తెలిపారు. తమను రెగ్యులరైజ్ చేయాలని నిరవధిక సమ్మె చేస్తున్న సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

కిచెన్ గార్డెనింగ్‌పై అవగాహన

వెంకటాపురం(నూగూరు), జూన్ 28: మండలంలోని నాయకులగూడెం గ్రామంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సేంద్రియ వ్యవసాయం, కిచెన్‌గార్డెనింగ్‌పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఈవో శ్యాం సుందర్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయానికి ఖరీదైన ఎరువులు, పురుగుమందులు వాడాల్సిన అవసరం లేదని అన్నారు. సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలని, ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో కిచెన్‌గార్డెన్ పెంచుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందసంస్థ సిబ్బంది గొంది హనుమంతు, ఇందిర, ఉషారాణి, ప్రశాంత్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెల మృత్యువాత

తాడ్వాయి, జూన్ 28: విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని నర్సింగాపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామంలోని మల్లెబోయిన కృష్ణ, పిట్టల పోశాలకు చెందిన పాడిగేదెలు మేత కోసం కామారం గ్రామ శివారులోకి వెళ్లాయి. ఈక్రమంలో పొలం సమీపంలో మేతమేస్తూ పక్కనే ఉన్న విద్యుత్ మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరుకు తగిలి షాక్‌కు గురై మృతిచెందాయి. సుమారు రూ.80 వేల విలువచేసే పాడిగేదెలను కోల్పోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

కన్నాయిగూడెం, జూన్ 28: కన్నాయిగూడెం నూతన ఎస్సైగా వెంకటేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఎం.సురేష్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో వెంకటేష్ నియామకమయ్యారు. ఈసందర్భంగా పలువురు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆటపాటలతో విద్యనందించాలి : సీడీపీవో

మొగుళ్లపల్లి, జూన్ 28: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు భూపాలపల్లి సీడీపీవో అవంతిక సూచించారు. మొగుళ్లపల్లి, రంగాపురం గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లకు శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ స్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసిందని, చిన్నారులకు ప్రశాంత వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు రజిత, జయప్రద, సునీత, కవిత, అరుణ, సంధ్య పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహదేవపూర్, జూన్ 28: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజనీతి శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ ఎకనామిక్స్ అధ్యా పకులను నియమించనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ చేసి ఉండి 55శాతం మార్కులు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 5 శాతం మినహాయింపు ఉంటుందని వివరిం చారు. జూలై 2లోగా కళాశాలలో సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను సమర్పించాలని సూచించారు.

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రై డే

కాటారం, జూన్ 28: మండల వ్యాప్తంగా 24 గ్రామపంచాయతీల పరిధిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. వానాకాలంలో విజృంభించే డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులను అరికట్టడానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పంచాయతీ కార్యదర్శులతో కలిసి డ్రై డే నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఇల్లిల్లూ తిరుగుతూ రోజుల తరబడి నిల్వ ఉన్న నీళ్లను పారబోయించారు. దోమలు వ్యాప్తి చెందకుండా మందును పిచికారీ చేయించారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన కల్పించారు.

సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం

కార్మిక సంఘాల ఐక్య వేదిక నేతలు



కాకతీయఖని, జూన్ 28: కేంద్ర ప్రభుత్వం తీరుతో సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు విమర్శించారు. భూపాలపల్లి పట్టణంలోని బాతాలరాజ్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎస్ యూఎస్, హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ పాల్గొన్నారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, టీఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధా నాలను అవలంబిస్తోందని మండిప డ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు అప్పగించేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సింగరేణిని రక్షించుకో వడంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సింగరేణిని పరిరక్షించేందుకు స్ట్రైక్ నోటీ సులు ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సకల జనుల సమ్మెలో మాదిరిగా సహకరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు కృష్ణ, పోషమల్లు, నారాయణ, నరేష్, రాజయ్య, వెంకన్న, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నాం : టీబీజీకేఎస్

సింగరేణి గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తు న్నామని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం భూపాలపల్లి ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య అన్నారు. భూపాలపల్లిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయకుంటే టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. సింగరేణిని నిర్వీర్యం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయన్నారు. దానికి వ్యతిరేకంగా దశల వారీ ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు దేవరకొండ మధు, రమణారెడ్డి, సురేష్, నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేసి సంస్థకే కేటాయించాలంటూ సీపీఎం నాయకులు భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేసి సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, కృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలి : డీఈవో పాణిని

ములుగు కలెక్టరేట్, జూన్ 28: ములుగు మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను పాటించాలని డీఈవో పాణిని సూచించారు. ములుగులోని మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో సామల శ్రీనివాసులు అధ్యక్షతన ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో శుక్రవారం జరిగిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. జీవో 1ని అనుసరించి పాఠశాలలను నిర్వహించాలని, ఫిట్‌నెస్ ఉన్న బస్సులను నడిపించాలని, పాఠశాల రికగ్నిషన్ కాపీ, ఫీజుల వివరాలు, ఉపాధ్యాయుల విద్యార్హతలు పాఠశాల నోటీస్‌బోర్డుపై ప్రదర్శించాలన్నారు. పాఠశాల నేమ్‌బోర్డులో రికగ్నిషన్ కాపీలో ఉన్న పేరు మినహా ఈ-టెక్నో, ఐఐటీ, ఇంటర్నేషనల్, డిజి, ఒలంపియాడ్, సీబీఎస్ఈ వంటి పదాలు ప్రదర్శించకూడదని అన్నారు. పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్ అమ్మొద్దన్నారు. లేదంటే కఠిన చర్యలు తప్పవన్నారు.

సారు.. అదే తీరు

- భూపాలపల్లికి చెందిన వాహనాన్ని వాడుకుంటున్న పాత కలెక్టర్
- బదిలీ అయినా ఇవ్వకపోవడం పట్ల విమర్శలు

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 28: ఆయన ఓ ఐఏఎస్ అధికారి. భూపాలపల్లి కలెక్టర్‌గా పనిచేశారయన. ఇటీవలే బదిలీ అయ్యి రాష్ట్ర రాజధానిలో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే.. ఇక్కడ ఆయన పనిచేసినప్పుడు ప్రభుత్వం ఆయనకు కేటాయించిన వాహనాన్ని ఇప్పటికీ అక్కడ కూడా వాడుకోవడం విమర్శలకు తావిస్తోంది. అంతేకాదు.. ఇక్కడి ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలను కూడా ఆయన వినియోగించుకుంటున్నారని తెలుస్తోంది.

భూపాలపల్లి కలెక్టర్‌గా పనిచేసిన భవేష్‌మిశ్రాను ఈనెల 15న ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో రాహుల్ శర్మను కలెక్టర్‌గా పంపింది. ప్రస్తుతం భవేష్ మిశ్రా ఐటీ శాఖ ఉప కార్యదర్శిగా హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా.. నిబంధనలను ఆయన అతిక్రమించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌కు వెళ్తూ తన వెంట బొలేరో వాహనాన్ని భవేష్ మిశ్రా తీసుకెళ్లడం విమర్శలకు తావిస్తోంది. భూపాలపల్లిలో పనిచేసినప్పుడు జిల్లాలో పర్యటించేందుకు ప్రభుత్వం ఆయనకు ఈ వాహనాన్ని కేటాయించింది. సాధారణంగా బదిలీపై వెళ్లే అధికారులు ఎక్కడి వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లాలి. భవేష్ మిశ్రా మాత్రం బొలేరో వాహనాన్ని తన వెంట తీసుకెళ్లి ఉపయోగించు కుంటున్నారని సమాచారం. జిల్లా అధికార యంత్రాంగం అవసరాల కోసం కొనుగోలు చేసిన వాహనాన్ని వ్యక్తిగత అవసరాలకు ఆయన వాడుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. అలాగే ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలను కూడా భవేష్ మిశ్రా వినియోగించుకుంటున్నారని తెలిసింది. భూపాలపల్లి కలెక్టర్‌గా విధుల నుంచి ప్రభుత్వం తప్పించినా జిల్లాకు సంబంధించిన భోగాలను భవేష్ మిశ్రా అనుభవిస్తుండటంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గురుకుల భవన నిర్మాణ పనులు ప్రారంభం

కాటారం, జూన్ 28: మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో తరగతి గదుల భవన సముదాయ నిర్మాణం ప్రారంభమైంది. గతంలోనే రూ.4.20 కోట్లతో గురుకులానికి నాలుగు అంతస్తుల భవనం నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి అదే భవనాన్ని తరగతులపాటు డార్మెటరీ కోసం ఉపయోగిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తరగతుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా భవనం నిర్మించడానికి రూ.5 కోట్ల అంచనా వ్యయంతో నిధులు మంజూరయ్యాయి. రూ.3.80 కోట్లతో పలుమార్లు టెండర్ పిలిచినా ఎవరూ ముందుకురాలేదు.

శాసనసభ ఎన్నికలకు ముందు టెండర్ ప్రక్రియ నిర్వహించగా కొందరు టెండర్ దక్కించుకున్నారు. దీంతో గురుకుల విద్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తరగతుల నిర్వహణ కోసమే భవనాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌తో నిర్మించనున్నారు.

ఘనంగా పీవీ జయంతి వేడుకలు


పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

మహదేవపూర్, జూన్ 28: మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు 103వ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సోషల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ దక్షిణాది నుంచి ప్రధాన మంత్రిగా ఎదిగిన గొప్ప దార్శనికుడు పీవీ నర్సింహరావు అని కొనియాడారు. దేశంలో రాజకీయ అస్థిరత ఉన్న సమయంలో స్థిరమైన పాలన అందించిన గొప్ప నాయకుడని అన్నారు. బహుభాషా కోవిదుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, రాజు, మాధవి, రవీందర్, రజిత, పరశురాములు, మున్నయ్య, శివ, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగనిరతితో వైద్య సేవలందించాలి

హెల్త్ మిషన్ రీజినల్ డైరెక్టర్ అనురాధ మెడోజు


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ రీజినల్ డైరెక్టర్ అనురాధ మెడోజు

ములుగు కలెక్టరేట్, జూన్ 28: వైద్యులు త్యాగనిరతితో రోగులకు సేవలందిస్తూ వారి బాధలను అర్థం చేసుకోవాలని నేషనల్ హెల్త్ మిషన్ తెలంగాణ సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మెడోజు అన్నారు. శుక్రవారం ములుగులోని వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అధ్యక్షతన ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని పీహెచ్‌సీ వైద్యులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌తో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నేషనల్ హెల్త్‌మిషన్ నుంచి అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, వాటిని అమలుపరిచే విధానంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని, రోగులకు బాధ్యతాయుతంగా, మానవతాదృక్పథంతో సేవలందించాలన్నారు. దేశంలో ఆరోగ్య కార్యక్రమాలపై భారత ప్రభుత్వం ఒక మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిందని, దాని ద్వారానే కోవిడ్ వంటి అతి క్లిష్టమైన సమయంలో కూడా ప్రజలకు సేవలందించినట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సేవలను జిల్లా ఆస్పత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలు సేవలు వినియోగించుకునేవిధంగా చూడాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రతి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతోపాటు త్వరితగతిన రోగ నిర్ధారణ పరీక్షలు జరిపి చికిత్సలు అందించాలని, సంక్షేమం కోసం యోగా, మెడిటేషన్ వంటి సేవలు కల్పించాలని, క్లిష్టతరమైన కేసులను పెద్దాస్పత్రులకు రెఫర్ చేయాలని అన్నారు. జిల్లాలో మాతృ మరణాల సంఖ్యను తగ్గించినందుకు ఆమె వైద్యసిబ్బందిని అభినందించారు. డీఎంహెచ్‌వో అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలుపరిచేందుకు వైద్యులు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, సిబ్బంది తమవంతుగా కృషి చేసి ములుగు జిల్లాను ముందువరుసలో ఉంచాలని అన్నారు. ఈసమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పోరిక రవీందర్, పవన్, శ్రీకాంత్, రణధీర, డెమో తిరుపతయ్య ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని వైద్యులు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు పాల్గొన్నారు.

బొగ్గు గనుల్లో కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలు

కాకతీయఖని, జూన్ 28: సింగరేణి భూపాలపల్లి ఏరియాకు నూతన ఎస్‌డీఎల్ యంత్రాలు వచ్చాయి. కాలం చెల్లిన యంత్రాలతోనే బొగ్గు బావుల్లో పనులు చేపడుతున్నారని, దీంతో కార్మికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఈనెల 16న 'ఆంధ్రజ్యోతి'లో 'యంత్రం... తూతూమంత్రం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సింగరేణి యాజమాన్యం 16 ఎస్‌డీఎల్ యంత్రాలను భూపాలపల్లి ఏరియాకు పంపింది. కేటీకే-1వ గనికి నాలుగు, కేటీకే-5వ గనికి నాలుగు, కేటీకే 6వ గనికి రెండు, కేటీకే-8వ గనికి ఆరు యంత్రాలను తరలించారు. మరో మూడు యంత్రాలు జూలైలో రానున్నట్లు ఏరియా సింగరేణి అధికారులు తెలిపారు.

నూతన ఎస్‌డీఎల్ యంత్రాలు అందుబాటులోకి రావడంతో అండర్‌గ్రౌండ్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి ఊపందుకుంటుందని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

మొగుళ్లపల్లి, జూన్ 28: ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం ఆయన అమ్మ ఆదర్శ పాఠశాలలైన మొగుళ్లపల్లి, ఇస్సిపేటలో చేపట్టిన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీరు, ప్రహరీ, అదనపు తరగతిగదులు, వంటగది వంటి నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌లకు సూచించారు. ఇస్సిపేట పాఠశాలను కలెక్టర్ సందర్శించగా విద్యార్థులు బొకేలు అందజేసి స్వాగతం పలికారు. పాఠశాలకు ఎంతమంది విద్యార్థులు వస్తున్నారు, ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలు సుకు న్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సునీత, ఇన్‌చార్జి ఎంపీ డీవో హుస్సేన్, ఎంఈవో వీరస్వామి, ఆర్ఐ సురేందర్‌రెడ్డి ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

చిట్యాల: మారుమూల ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని ప్రతీ వార్డును ఆయన సందర్శించారు. రోగులు, వైద్య సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆస్పత్రి సేవలపై ప్రజలకు నమ్మకం కలిగేలా చికిత్సలు చేయాలని, ఆస్పత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.అంతకుముందు జడలపేట శివారు గాంధీనగర్, భీష్మనగర్ ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు చేస్తున్న అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. తిర్మలాపురం శివారు రామచంద్రాపురంలో అంగన్వాడీ సిబ్బంది శిక్షణ శిబిరాన్ని సందర్శించి వారితో ముచ్చటించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపాలన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులను పరిచయం చేసుకున్నారు. కేంద్రం ఆవరణలో కిచెన్ గార్డెన్, ఆట వస్తువులు, ఇతర పరికరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట సీడీపీవో అవంతి, ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ మోహి యొద్దీన్, ఎంపీవో రామకృష్ణ, గిర్దావర్ రాజు, సూపరింటెండెంట్ జీడీ తిరుపతి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మనోహర్‌రావు, అనిల్, అంగన్‌వాడీ టీచర్ సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ

కాటారం, జూన్ 28: మండలంలోని గంగారం క్రాస్ రోడ్డు వద్ద గల టీజీఎండీసీ చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక క్వారీల నుంచి లారీల్లో ఓవర్ లోడ్‌తో ఇసుకను తరలించడం, వేబిల్లులు లేకుండా జీరో దందా సాగించడం తదితర అంశాలను అరికట్టడానికి లారీలను తనిఖీ చేశారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని, ఏ సమాచారం ఉన్నా పోలీస్ అధికారులకు అందించాలని టీజీఎండీసీ సిబ్బందినిఆదేశించారు. ఆయన వెంట కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై మ్యాక అభినవ్ ఉన్నారు.